ప్రజాశక్తి
బుధవారం 10 సెప్టెంబర్ 2025 1
అనంతపురం శ్రీ సత్యసాయి







సూపర్‌హిట్‌కు సర్వం సిద్ధం



అనంతపురం ఇంధ్రప్రస్థ వద్ద జరుగుతున్న బహిరంగ సభ ఏర్పాట్లు





- బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు
- భారీ జనసమీకరణకు జిల్లా నేతల కసరత్తు
- నేడు ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరం వేదికగా బుధవారం జరుగుతున్న 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' కార్యక్రమం విజయవంతం చేయడానికి సర్వం సిద్ధం అయ్యింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు రాష్ట్ర స్థాయి నేతలందరూ అనంత పురం నగరానికి తరలి రానుండటంతో అంతటా సందడి నెలకొంది. మంగళవారం నాటికే రాష్ట్ర మంత్రలందరూ అనంతపురం నగరం చేరుకున్నారు. ప్రధాన కూడళ్లు, నగర వీధులు పసుపు తోరణాలు, ప్లెక్సీలతో మిగతా 3లో


ఉద్యోగాలకు ఎంపికైన వారితో పివికెకె యాజమాన్యం, సిబ్బంది

జాబ్‌మేళాలో ఉద్యోగాలకు 12 మంది ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

పెనుకొండలోని కియా మోటార్స్‌కు అనుబంధ ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఎన్‌విహెచ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం పివికెకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన జాబ్‌మేళాలో 12 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నలుమూలల నుంచి దాదాపు వందకుపైగా బిటెక్, డిప్లొమా విద్యార్థులు హాజరు కాగా ఆన్‌లైన్ రాత పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూ అనంతరం 12 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. వారికి వార్షిక వేతనం రూ.2.4లక్షలు ఉంటుందన్నారు. ఎంపిక ప్రక్రియను సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ మల్లికార్జున, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ విశ్వనాథ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మక సంస్థల్లో విద్యార్థులు ప్లేస్‌మెంట్ సాధించడం మా కళాశాల ప్రతిభకు నిదర్శనమన్నారు. ఈ అవకాశాలు విద్యార్థుల కెరీర్‌కు బలమైన పునాది వేస్తాయని అభిప్రాయపడ్డారు.

వి.కొత్తకోటలో పారిశుధ్య పనులు

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామంలో సర్పంచు తిమ్మరాజు పర్యవేక్షణలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామంలోనే ఎస్సీ, బీసీ, ఓసి కాలనీలతో పాటు ప్రధాన రహదారి, వీధి రోడ్లకు ఇరువైపుల ఉన్న డ్రెయినేజీల్లో పేరుకుపోయిన బురద, చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచు సూచించారు.

పాత కొత్తచెరువులో 'పొలంబడి'

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని పాత కొత్తచెరువు, దంచర్ల గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారిణి లీనా వసుంధర ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంటల సాగు, చీడపీడలు, నివారణ చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా లీనా వసుంధర మాట్లాడుతూ రైతులు కేవలం యూరియాపైనే ఆధార పడకుండా జీవన ఎరువులు, ప్రకృతి ప్రసాదించిన వేపపిండి వాడాలన్నారు. పెట్టుబడును తగ్గించుకుని ఆరోగ్యకరమైన పంటలు పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ అనూష, కరీం, రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రాప్తాడు : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ సెల్ సబ్‌ఇన్స్‌పెక్టర్ బి.హనుమంతు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని హంపాపురం వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రిన్సిపాల్ టి.విష్ణువర్ధన్ అధ్యక్షతన 'డ్రగ్స్‌కు చెబుదాం నో' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ విబిఆర్ శర్మ, ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ వెన్నెపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి తరహా అవగాహన కార్యక్రమాలు యువతలో మానసిక ఆరోగ్యం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాన్నారు. ఈగల్ సెల్ సబ్ ఇన్స్‌పెక్టర్ బి.హనుమంతు మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందన్నారు. కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి మత్తు పదార్థాలను అరికట్టాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండి వెన్నెపూస రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టి.విష్ణువర్ధన్, హెచ్‌అండ్ఎస్ విభాగాధిపతి ఎ.చంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సూపర్ హిట్'తో రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం

మాజీమంత్రి దేవినేని, విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేందుకు అనంతపురంలో 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభ వేదిక కాబోతోందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రాయదుర్గంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు కూటమి కి స్పష్టమైన అత్యధిక మెజారిటీని ఇచ్చి రాష్ట్రంలో అధికారంలో కూర్చోబెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం గత 15 నెలల కాలంలో ఆశించిన దానికన్నా మిన్నగా మంచి పాలన అందించి ప్రజలకు చెప్పుకునే వేదికగా అనంతపురం సభ ఏర్పాటు కావడం తమ అదృష్టమన్నారు. కూటమికి చెందిన


విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి దేవినేని, విప్ కాలవ

మూడు పార్టీల నాయకులు పాల్గొని కార్యకర్తలు అధికసంఖ్యలో ఈ సభకు పాల్గొనాలని కోరారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేసేందుకు ఎన్టీఆర్ కలల ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు గోదావరి- కృషానదుల అనుసంధానం చేయడం ద్వారా సీమను సస్యశ్యామలం చేసేందుకు చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వివరించారు. సీమ బిడ్డగా చెప్పుకునే జగన్ గతంలో రాష్ట్రంలో పాలన చేసినప్పుడు రాష్ట్ర భవిష్యత్తు చిన్నాభిన్నమైందన్నారు. రూ.3500 కోట్ల లిక్కర్ కుంభకోణం జగన్ అనుయాయులు దోచుకున్నట్లు చెప్పారు. రాయదుర్గం ప్రాంతం కూడా బిటీ ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం, తుంగభద్ర ఎగువ కాలువ, హంద్రీనీవా పథకం పూర్తి ద్వారా రాయదుర్గం నియోజకవర్గం అన్ని విధాల అభివద్ధి చెంది ఉద్యానవన పంటలకు చిరునామాగా, పర్యాటక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు కృష్ణమూర్తి, నాగరాజు, భారతి, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు బ్రహ్మసముద్రం విద్యార్థి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

బ్రహ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న రాఘవేంద్ర రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పిఇటి ఇబ్రహీం, ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నింబగల్లులో జరిగిన 5వ అసోసియేషన్ సెపక్‌తక్రా పోటీల్లో హెచ్.రాఘవేంద్ర అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఇతను సెప్టెంబర్ 13, 14వతేదీల్లో ఉరవకొండ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రుల నింగప్ప, లక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటనారాయణ, హనుమంతురెడ్డి, రవికుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రిడ్స్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రిడ్స్ పియు-2 ప్రాజెక్టు మేనేజర్ మహేష్, టిబి సూపర్‌వైజర్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బొమ్మప్ప, ఎఎన్ఎం కిరణ్ కుమార్, రీడ్స్ సిబ్బంది నీలావతి, పద్మ, అనూష, పుష్ప, యశోద పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హారున్ రషీద్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయడంతోపాటు ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు వంటి ఒకేషనల్ కోర్సులను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరుణ్ రషీద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వచ్చి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల జూనియర్ కళాశాలకు సొంత భవనం లేక విద్యార్థులు కొంతమంది క్లాసుల్లో విద్యను అభ్యసిస్తుంటే.. మరికొందరు బయట ఎండలో కూర్చొని విద్యను అభ్యసించే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని, గురువు కూడా నియోజకవర్గం విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఎంఅండ్ఎటి, ఇటిఎఅండ్‌టి సిరికల్చర్ కోర్సులతోపాటు అదనంగా ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు వంటి కోర్సులను


వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏర్పాటు చేయాలన్నారు. అలాగే జూనియర్ కళాశాలలో నాణ్యమైన భోజనం అందించాలని, లేనిపక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉరవకొండ పట్టణ అధ్యక్షుడు ఎల్.రాజేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధార్థ, కార్తీక్, పవన్, నవదీప్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'గో బ్యాక్ కార్పొరేట్ సెలూన్స్'

నాయీ బ్రాహ్మణుల నిరసన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో కార్పొరేట్ సెలూన్ షాపులు తొలగించాలని డిమాండ్ చేస్తూ 'గో బ్యాక్ కార్పొరేట్ సెలూన్స్' అంటూ మండలంలోని నాయీబ్రాహ్మణులు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పాత గుంతకల్లులోని హజరత్ మస్తానయ్య దర్గా నుంచి చీఫ్ అండ్ బెస్ట్ కార్పొరేట్ సెలూన్ దగ్గర వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, క్షవర వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, కాటికాపరుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గిలి రమేష్, సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, రజక సంఘం జిల్లా నాయకులు దేవేంద్రప్ప, వాల్మీకి సంఘం పట్టణ అధ్యక్షులు యల్లప్ప, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు స్వామిదాస్, ఆనంద్, అంబేద్కర్ యువజన సంఘం పట్టణ నాయకులు జన్నే మస్తాన్ మాట్లాడుతూ మానవ సమాజం అవతరించినప్పుడు మనుషులకు శుభ్రత నేర్పించిన మంగలి వృత్తి ప్రాచీనమైందన్నారు. అలాంటి నాయీబ్రాహ్మణ సామాజిక వర్గం యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక పూర్వీకులు నమ్ముకున్న కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. అలాంటి క్షవర వృత్తిపై కార్పొరేట్ కాటు పడటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించి తక్షణమే పట్టణంలోని కార్పొరేట్ సెలూన్ షాపులను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, తిమ్మప్ప, డివైఎఫ్ఐ యువజన సంఘం నాయకులు సురేంద్రబాబు, పట్టణ పౌరుల సంఘం నాయకులు ఉలిగప్ప, ఐద్వా మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ, నాయీబ్రాహ్మణులు పాల్గొన్నారు.

యూరియా వాడకంపై అవగాహన

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని పిల్లలపల్లి గ్రామంలో మంగళవారం యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానవన అధికారి కృష్ణతేజ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలను అనుసరించి ఎరువులను వాడాలన్నారు. ముఖ్యంగా పంటల్లో యూరియా వాడితే నేల ఆరోగ్యం కాపాడుకోవడమేగాక తక్కువ ఖర్చుతో పంట ఉత్పత్తులను పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఉద్యానశాఖ 2025- 26 ఆర్థిక సంవత్సరం సంబంధించి ఎంఐడిహెచ్‌లో కొత్త తోటల విస్తరణ కింద నేరేడు, మామిడి, ఫారంపాండ్‌లు, సోలార్ కోల్డ్ రూమ్స్, కోల్డ్ స్టోరేజస్, ఆర్‌కెవైలో శాశ్వతం పందిర్లు (ద్రాక్ష, కాకర, బీర), ప్లాస్టిక్ క్రేట్స్ టమాటో (100), మామిడి (250), ఒక హెక్టారుకు బాక్సులు కొని బిల్ ఇచ్చినట్లుయితే 40 నుంచి 50శాతం రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ గోపాల్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలి : డివైఎఫ్ఐ



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు

ప్రజాశక్తి-గుంతకల్లు

గుంతకల్లు పట్టణంలో మూతపడిన స్పిన్నింగ్ మిల్లు స్థానంలో ప్రత్యామ్నాయంగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక హంపి రెడ్డి భవనంలో డివైఎఫ్ఐ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంతకల్లు పట్టణంలో ఎన్నో సంవత్సరాలు నుంచి మూతపడిన స్పిన్నింగ్ మిల్ స్థానంలో ప్రత్యామ్నాయంగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసే అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. గుంతకల్ పట్టణంలో ఉపాధి పరిశ్రమలు లేక నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మిల్లు స్థానంలో ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు కాలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అయినా స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు, మల్లేష్ కుమార్, సోయల్ పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - అనంతపురం

ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో క్యూఆర్ కోడ్ సేవలు ప్రారంభం అయ్యాయి. అప్కాబ్ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఏడీసీసీ బ్యాంకు అధ్యక్షులు కేశవరెడ్డి, విజయనగరం డీసీసీ బ్యాంకు అధ్యక్షులు కిమిడి నాగార్జునలు రాచానపల్లి పీఏసీఎస్‌కు క్యూఆర్ కోడ్ పరికరాలను అందజేశారు. బ్యాంకు ఖాతాదారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్వరలో ఈ క్యూఆర్ కోడ్ పరికరాలను అందజేస్తామని తెలిపారు. ఖాతాదారులకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించే దిశగా బ్యాంకు కృషి చేస్తుందని అధ్యక్షులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో కె.సురేఖ రాణి, డీజీఎంలు విజయచంద్రారెడ్డి, రాంప్రసాద్, సుఖదేవ్ బాబు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ పరికరాలను అందిస్తున్న ఆప్కాబ్ అధ్యక్షులు

రాష్ట్రాభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్

ప్రజాశక్తి-గుత్తి

ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏపీ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధితో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయ కేతనం ఎగరవేస్తారన్నారు. రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు. అనంతరం బుధవారం నాడు అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్, సూపర్ హిట్ విజయోత్సవ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జి.సూర్య ప్రతాప్, నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్ బర్దివలి, సర్పంచులు పి.భరత్ కుమార్, లింగమయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా యాదవ్, బి.రమేష్, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎంకె.చౌదరి, బి.మారుతి ప్రసాద్, మండల కార్యదర్శి పల్లా సాంబశివ యాదవ్, నాయకులు కోనంకి కృష్ణ, పి.రవితేజ, పి.నారాయణస్వామి, ఎ.గోవర్ధన్ గౌడ్, లక్ష్మీ రంగయ్య, రియాజ్, రంగప్ప, రామాంజి, కె.సునీత పాల్గొన్నారు.


సూపర్ హిట్ సభ పోస్టర్లు విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

మొదటి పేజీ తరువాయి

'సూపర్ హిట్'కు సర్వం సిద్ధం..!

నిండిపోయాయి. పెద్దఎత్తున స్వాగత కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు.

నేడు బహిరంగ సభ

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసామని చెబుతూ 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' పేరుతో అనంతపురంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసింది. బుధవారం మధ్యాహ్నం అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీ సమీపంలో ముత్యాలరెడ్డి లేఅవుట్‌లో బహిరంగ సభ జరుగనుంది. రాష్ట్రస్థాయి కార్యక్రమంగా దీన్ని నిర్వహిస్తుండటంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులతోపాటు టిడిపి,జనసేన, బిజెపి మూడు పార్టీల నేతలు తరలిరానున్నారు. మంగళవారం నాటికే రాష్ట్ర మంత్రలందరూ అనంతపురం నగరానికి విచ్చేశారు. బుధవారం మధ్యాహ్నానానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హెలికాప్టర్‌లో ఉండవల్లి నుంచి అనంతపురంకు చేరుకుంటారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా అదే సమయానికి ఇక్కడికి విచ్చేయనున్నారు.

సభకు భారీగా ఏర్పాట్లు

'సూపర్ సిక్స్ -సూపర్ హిట్' కార్యాక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు పార్టీల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొననుండటంతో అందరూ కూర్చోనేందుకు వీలుగా భారీ వేదికను ఏర్పాటు చేశారు. అందుకు తగ్గట్టు జనసమీకరణకు కసరత్తు చేపట్టారు. అధికార యంత్రాంగాన్ని జనసమీకరణకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ప్రధానంగా మహిళా సంఘాల సభ్యులకు ఈ కార్యక్రమానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల వారీగా బాధ్యతలను అప్పగించారు. సభ ఏర్పాట్లను, జనసమీకరణ పనులను గడిచిన నాలుగు రోజులుగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, రవాణ శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిలు పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 మాసాల్లోనే ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసిందని, ఈ విషయాలను ప్రజలకు వివరించేందుకు ఈ సభను ఏర్పాటు చేస్తున్నట్టు వారు వివరించారు. జనసమీకరణ కోసం 2987 ఆర్టీసీ బస్సులను వినియోగిస్తున్నారు. ఇదే సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

జాతీయ రహదారి మళ్లింపు

సూపర్ హిట్ సభ జరుగుతున్న ప్రాంతం జాతీయ రహదారి అనుకుని ఉంది. అక్కడికి వాహనాల రాకపోతే ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు వీలుగా ఎన్‌హెచ్ 44పైన వాహనాల రాకపోకలను దారి మళ్లించారు. హైదరాబాద్-బెంగళూరు నుంచి వచ్చే వాహనాలను వడియంపేట గ్రామం నుంచి నాయనపల్లి క్రాస్ మీదుగా ధర్మవరం, ఎన్ఎస్‌గేటు వైపు మళ్లించారు. తిరుపతి వెళ్లే వాహనాలను అదే రకంగా దారి మళ్లించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు షెడ్యూల్ ఇలా..

- మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లి నుంచి హెలీక్యాప్టర్‌లో బయలుదేరుతారు
- 1-30 గంటలకు అనంతపురం చేరుకుంటారు.
- 1-30కు మంత్రులు, ఎమ్మెల్యేలు స్వాగతం పలుకుతారు. ఇదే సమయంలో మంత్రులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహిస్తారు.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు బహిరంగ సభలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఇతరులు ప్రసంగిస్తారు.
- బహిరంగ సభ అనంతరం ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో చంద్రబాబు తిరుగుప్రయాణం అవుతారు.

ఉపముఖ్యమంత్రి షెడ్యూల్ ఇలా..

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం మధ్యాహ్నం 12-40 గంటలకు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాయశ్రం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన అనంతపురంలోని బహిరంగ సభ వేదిక ఇంధ్రప్రస్థకు చేరుకుంటారు.

నేడు పాఠశాలలకు సెలవు

అనంతపురం సిటీ : అనంతపురంలో నేడు నిర్వహించనున్న 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని విద్యాలయాలన్నిటికీ బుధవారం సెలవు ప్రకటించినట్లు విద్యాశాఖ అధికారులు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సభకు ఎలాంటి అవాంతరాలు సంభవించకుండా ఉండటానికి సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

సంగా తేజశ్వని కారుపై దాడి


పగిలిన కారు అద్దాన్ని చూపుతున్న సంగా తేజశ్వని

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలో ఆంధ్రప్రదేశ్ తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని కారుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. ఇంటి వద్ద నిలిపిన కారుపై రాళ్లు విసరడంతో వెనుక అద్దాలు పగిలిపోయాయి. ఈ సందర్భంగా తేజస్విని మాట్లాడుతూ అనంతపురం నగరంలో "సూపర్ 6- సూపర్ హిట్" విజయోత్సవ భారీ బహిరంగ సభ ఏర్పాట్లు దిగ్విజయంగా జరుగుతున్న నేపథ్యంలో దానిని జీర్ణించుకోలేక వైసిపికి చెందిన వారే ఇలా దాడులు చేశారన్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్‌గా బర్దివలి

ప్రజాశక్తి-గుత్తి


బర్దివలి

ఏపీ రాష్ట్ర నూర్ బాషా,దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా గుత్తి మండలం బేతాపల్లి గ్రామానికి చెందిన టిడిపి మండల కన్వీనర్ షేక్ బర్దివలి నియమితులయ్యారు. పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న టిడిపి కార్యాలయంలో షేక్ బర్దివలిని టిడిపి నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, సింగిల్ విండో అధ్యక్షులు ఎన్.శివ శంకర్ యాదవ్, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎంకె.చౌదరి, బి.మారుతి ప్రసాద్, మండల కార్యదర్శి పల్లా సాంబశివ యాదవ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా యాదవ్, బి.రమేష్, నాయకులు ఆర్ఎస్.రాజా, న్యాయవాది సోము, సర్పంచులు బి.భరత్ కుమార్, యు.రామలింగమయ్య పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ బహిరంగసభకు తరలిరండి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్, సూపర్ హిట్ భారీ బహిరంగసభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తరలిరావాలని పెద్దవడుగూరు మండల టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జెసి కల్యాణమండపం ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో తెలుగుయువత నాయకుడు దివాకరరెడ్డి, నాయకులు గంగరాజు, నారాయణస్వామి, ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాజారెడ్డి, అరెకటిక కార్పొరేషన్ ఛైర్మన్ హరికృష్ణారావు, హరినాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, బాషా, వెంకట్రామిరెడ్డి, నాగన్న, రామచంద్రారెడ్డి, విజయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిరంజీవులు, మిడుతూరు రమేష్ యాదవ్ తదితరులు పాల్గొని సూపర్ సిక్స్, సూపర్ హిట్ సభకు జన సమీకరణపై చర్చించారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి యుగంధర్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు, పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. హాజరుపట్టిక, మందులు, వ్యాక్సిన్ గదులను తనిఖీ చేశారు. విధులకు సక్రమంగా రాకుండా నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై వేటు తప్పదని హెచ్చరించారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపరతుల్లోనే ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట క్రిష్టిపాడు, పెద్దవడుగూరు ఆసుపత్రుల వైద్యులు శ్రీనివాసబాబు, త్రివేణి, పుష్పలత, సునీత, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

జిల్లాకు 800 మెట్రిక్ టన్నుల యూరియా

ప్రజాశక్తి-అనంతపురం

ఐపిఎల్ కంపెనీ యూరియా 800 మెట్రిక్ టన్నుల యూరియా మంగళవారం జిల్లాకు వచ్చినట్లు ఎడిఎ జిఎం.అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. సంయుక్త కలెక్టర్ ఆదేశం ప్రకారం ఇందులో మార్క్‌ఫెడ్‌కు 560 మెట్రిక్ టన్నులు, 240 మెట్రిక్ టన్నులు ప్రయివేటు డీలర్లకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



సంఘీభావం తెలుపుతున్న ఐలు నేతలు

ఆర్డీటీపై కూటమి నేతల వైఖరి ప్రకటించాలి

ఐలు నేతల డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి)కి ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్‌పై కూటమి పార్టీల నేతలు తమ స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర నాయకులు సూర్యచంద్రయాదవ్, జిల్లా కార్యదర్శి సతీష్, అధ్యక్షులు వీరుయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం బార్ అసోసియేషన్ హాల్‌లో ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు అత్యంత ప్రాధాన్యమైన ఆర్డీటీకి సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే రెన్యువల్ చేయాలన్నారు. నేడు జరగనున్న బహిరంగ సభలో ఆర్డీటీపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్, నాగరాజు, మలేష్‌గౌడ్, జిల్లా నాయకులు అశోక్ లక్ష్మణ్, నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.


ఎపి రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక


నూతన అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, కార్యదర్శి సాయికుమార్

పామిడి : స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ ఆధ్వర్యంలో ఎపి రైతుసంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. రైతు సంఘం మండల అధ్యక్షులుగా లక్ష్మణ్‌కుమార్, కార్యదర్శిగా సాయికుమార్, కమిటీ సభ్యులుగా కండ్లపల్లి చంద్రమోహన్‌రెడ్డి, ఎద్దులపల్లి గోవిందు, కట్టకిందపల్లి రామాంజనేయులు, అనుపల్లి రామాంజనేయులు, రామరాజుపల్లి దేవేంద్రరెడ్డి, ఎదురూరు లక్ష్మన్న, గజరాంపల్లి రంగనాయకులు, గజరాంపల్లి ఎర్రిస్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ రైతు సమస్యలపై అహర్నిశలు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు,రాము, మాబు, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

'కెటిఎస్' విద్యార్థి ప్రతిభ

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సిసి క్యాడేట్ గౌతమ్ రాజ్ ప్రత్యేక సాహస శిబిరంలో ప్రతిభ కనబరిచారు. కళాశాలలో బి.ఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గౌతమ్ అరుణాచల ప్రదేశ్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీ రింగ్ అండ్ స్పోర్ట్స్‌లో శిక్షణ తీసుకుని ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈమేరకు విద్యార్థిని మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎన్‌సిసి స్థాపించిన అనతి కాలంలోనే ఎన్సిసి క్యాడేట్లు జాతీయస్థాయిలో అనేకమైన క్యాంపులకు హాజరవుతూ చక్కన ప్రదర్శన చేస్తూ మంచి పేరు తెస్తున్నారన్నారు. ముఖ్యంగా గౌతమ్‌రాజు అరుణాచల్ ప్రదేశ్‌లో జాతీయస్థాయి సంస్థ నిమాస్‌లో ప్రత్యేక శిబిరంలో ట్రెక్కింగ్, శిలలను ఎక్కే క్రీడ, ఒక ఎత్తైన ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వేలాడదీసిన కేబుల్ ద్వారా కిందికి జారడం, టెంట్ నిర్మాణం, నదిని దాటడం మొదలైన సాహసోపేత అంశాల్లో శిక్షణ తీసుకొని రావడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి సిటిఓ బాల నరసింహులు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు, కిరణ్, బాబు, నారాయణ, ప్రశాంత్, పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.


గౌతమ్‌ను అభినందిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం

రైతులను విస్మరించిన 'కూటమి'

అనంత జిల్లావ్యాప్తంగా వైసిపి అన్నదాత పోరు-కదం తొక్కిన రైతులు, వైసీపీ శ్రేణులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగానికి పూర్తిగా విస్మరించిందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన 'అన్నదాత పోరు' విజయవంతమైంది. ఇందులో భాగంగా నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకూ భారీ ఎత్తున రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి ఆర్డీవో కేశవనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 15 నెలలుగా రైతులు కష్టాల్లో కూరుకుపోయారన్నారు. వారి మొర ఆలకించే నాథులే కరువయ్యారన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే చర్యలు చేపడుతుంటారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు నాణ్యమైన విత్తనాలు అందివ్వలేకపోయారని విమర్శించారు. అవసరమైన యూరియా కూడా అందుబాటులో ఉంచలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. సీజన్ ప్రారంభంలోనే డిస్ట్రిబ్యూటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందించాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏ సీజన్‌లో పంట నష్టపోతే అదే సీజన్‌లో రైతులను ఆదుకునేవారని గుర్తు చేశారు. కానీ నేడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని తెలిపారు. చీనీ, అరటి, ఉల్లి, టమోటా.. ఇలా ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక రోడ్లపై పారేస్తున్న పరిస్థితి ఉందన్నారు. హంద్రీనీవా నుంచి నీరు వస్తున్నా ఇక్కడి చెరువులకు నీరు ఇవ్వకుండా కుప్పానికి తీసుకెళ్లారని, ఇక్కడి రైతుల పొట్టగొట్టడం ఏంటని ప్రశ్నించారు. హంద్రీనీవాను వెడల్పు చేయడంతో పాటు


అనంతపురంలో ర్యాలీగా వస్తున్న వైసిపి నాయకులు

హెచ్ఎల్‌సీ ఆధునీకరణ చేపట్టాలన్నారు. తుంగభద్ర నుంచి నీరు విడుదలైన నేపథ్యంలో తక్షణం హెచ్ఎల్‌సీ నార్త్, సౌత్ కెనాళ్లకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డిచ ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, శింగనమల, తాడిపత్రి, రాప్తాడు సమన్వయకర్తలు శైలజానాథ్, పెద్దారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర ప్రసాద్‌రెడ్డి, పిఎసి సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : కూటమి ప్రభుత్వం సరైన ఎరువులను అందించకుండా రైతులను దగా చేస్తోందని నియోజకవర్గం వైసిపి కన్వీనర్ మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం కార్యనిర్వహణ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతీరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాది లింగేశ్వరబాబు, నాయకులు ఖలీల్, వాల్మీకి రాము, జింకల రామాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, వరలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి, జడ్పిటిసి ప్రవీణ్‌కుమార్ యాదవ్, మాజీ మండల కన్వీనర్ పీరా, నాయకులు సుభాష్‌రెడ్డి, గురుయాదవ్, వాల్మీకి శివ, ఫరూక్, ఈశ్వర్ రెడ్డి, రామకృష్ణ, గోవిందనాయక్, జయరామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంటౌన్ : రైతులకు సకాలంలో యూరియా ఇవ్వలేని దగా ప్రభుత్వమని వైసీపీ సమన్వయకర్తలు పీడీ రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన రైతుపోరు కార్యక్రమంలో భాగంగా స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి వాల్మీకి సర్కిల్, టీసర్కిల్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఎఒ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శులు బోయ తిప్పేస్వామి, ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు గౌని ఉపేంద్రరెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, మహిళా నాయకురాళ్లు చందన శివాజీ, ఉషారాణి, నాగలక్ష్మి, ఎంపీపీలు మారుతమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీలు గుద్దెళ్ల నాగరాజు, బొమ్మన్న, వివిధ మండలాల కన్వీనర్లు, పార్టీ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

సిఎం వస్తే పాఠశాలలకు సెలవులా.. : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో ముఖ్యమంత్రి సభ నిర్వహిస్తే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పాఠశాలలకు సెలవులు ప్రకటించడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షులు గిరి మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ఇవ్వడమంటే విద్యార్థులను చదువుకు దూరం చేయడమే అన్నారు. గత నెలరోజుల క్రితం కూటమి ప్రభుత్వం విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలు, ఇతర వ్యక్తుల ప్రవేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని, అయితే ఈరోజు మాత్రం కూటమి నాయకులు నిర్వహిస్తున్న మీటింగ్ కోసం విద్యార్థులను పాఠశాలకు రాకుండా చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యార్థులను చదువుకు దూరం చేయడం కోసం తీసుకున్న నిర్ణయమే అని ప్రత్యేకంగా అందరికీ అర్థం అవుతుందన్నారు. ఈ కూటమి ప్రభుత్వానికి విద్యార్థుల మీద కానీ ప్రభుత్వ విద్యాసంస్థలు కాపాడడంలో గాని ఏమాత్రం శ్రద్ధ లేదు అందుకు ప్రత్యక్ష నిదర్శనం గత ఐదు రోజుల క్రితం రాష్ట్ర క్యాబినెట్ 10 మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం కోసం తీసుకున్న నిర్ణయం అదేవిధంగా ఇప్పటికే సంక్షేమ హాస్టల్స్లో స్థానిక సమస్యలతో తీవ్రమైన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్ బిల్లులు మూడు వేలు పెంచాలని గత ఐదు రోజులు ఎస్ఎఫ్ఐ విజయవాడలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తే అక్రమ అరెస్టు చేయడం దానితోపాటు ఎన్నికల సందర్భంగా నారా లోకేష్ గారు 77 జీవో రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పటిదాకా ఆ జీవో గురించి మాట్లాడకపోవడం ఇప్పటివరకు 6,400 కోట్ల రూపాయలు ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్లో ఉంచడం అనేక సమస్యలు రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటుంటే ఈ సమస్యలు గాలికి వదిలేసి ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం మీటింగ్ కోసం బడులు సెలవు ఇవ్వడం అంటే ఇది రాజ్యాంగ విరుద్ధం దీనిని ఎస్ఎఫ్ఐ అనంతపురం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది

'సూపర్ సిక్స్' సభను విజయవంతం చేద్దాం

నార్పల : అనంతపురంలో నేడు నిర్వహించనున్న సూపర్ సిక్స్-సూపర్‌హిట్ విజయవంతం సభను జయప్రదం చేద్దామని టిడిపి మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీలను దాదాపు 75 శాతం అమలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం అనంతపురంలోని జిఎంఆర్ మైదానంలో 'సూపర్ సిక్స్' విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మార్కెట్లోకి 'షైన్' సరికొత్త మోడల్

న్యూ హార్నెట్ 125, షైన్ 100 డిఎక్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనంతపురం

అనంతపురం ఆర్ఎఫ్ రోడ్డులోని శివసాయి హోండాలో ఇటీవల హోండా సంస్థ రూపొందించిన న్యూ హార్నెట్ 125, షైన్ 100 డిఎక్స్ సరికొత్త ద్విచక్ర మోడల్స్‌ను రాష్ట్ర రవాణా, యూత్, స్పోర్ట్స్ శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు నచ్చే విధంగా హోండా సంస్థ వాహనాలను రూపొందించడం అభినందనీయమన్నారు. అంతేగాకుండా నగరంలోని శివసాయి హోండా సంస్థ 21 సంవత్సరాలుగా సేవలు అందించి ప్రజల ఆదరణ పొందడం అభినందనీయమన్నారు. 21వ వార్షికోత్సవం సందర్భంగా తీసిన లక్కీ డ్రాలో సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లికి చెందిన వంశీకృష్ణకు లక్కీ డ్రాలో లభించిన ఆపిల్ మొబైల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో శివసాయి హోండా అధినేత మల్లికార్జున, జిల్లా రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ వీర్రాజు, సిటీ యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజేష్, శివసాయి హోండా సేల్స్ మేనేజర్ శేషాద్రి, సర్వీస్ మేనేజర్ షఫీ, టాటాగోల్డ్ ఇన్‌ఛార్జి రావు, శివసాయి హోండా అకౌంటెంట్ రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నూతన బైకును ఆవిష్కరిస్తున్న అతిథులు

'సూపర్ హిట్' సభను విజయవంతం చేద్దాం

శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు

ప్రజాశక్తి-శింగనమల

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభను సక్సెస్ చేద్దామని శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పెన్షన్లు, డ్రిప్ ఇరిగేషన్, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీశక్తి పథకం వంటి పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. కావున అనంతపురంలో జరిగే సూపర్‌సిక్స్ సభకు మండల ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు


యూరియా కోసం సొసైటీ కేంద్రం వద్ద గుమికూడిన రైతులు

ప్రజాశక్తి - మడకశిర టౌన్

యూరియా కోసం రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పది రోజుల క్రితం 150 బస్తాలు రాగా తాజాగా సెప్టెంబర్ తొమ్మిదవ తేదీ కూడా మరో 280 బస్తాలు రావడంతో పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు అయితే వచ్చింది 280 బస్తాలు కాగా వాటిని 180 మంది రైతులకు మాత్రమే ఇవ్వగలిగారు.అయితే రైతుల మాత్రం వందల సంఖ్యలో రావడంతో కొద్దిసేపు రెండు బస్తాలు ఇచ్చిన అధికారులు ఒక్కొక్క బస్తా ఇవ్వడానికి ప్రయత్నించారు. సహజంగా మడకశిర ప్రాంతంలో వరి నాట్లు లేకపోయినా ఆరుతడి పంటలు మాత్రమే రైతులు సాగు చేస్తున్న వారికి కూడా కావలసిన యూరియా దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా కోసం గతంలో ఎప్పుడు కూడా లైన్ లో నిలబడి, ఎగబడి తీసుకున్న చరిత్ర లేదని కేవలం గతంలో వేరుశనగకు మాత్రమే ఇలా లైన్లో వేచి ఉండేవారమని రైతులు చెబుతున్నారు. తాజాగా మంగళవారం పంపిణీ చేసిన సందర్భంగా సొసైటీ ముందు వందల్లో రైతులు రావడంతో కేవలం 150 బస్తాలు మాత్రమే ఉన్నాయంటూ రైతులకు చెప్పడంతో చాలామంది ఎదురు చూడకుండా వెళ్లిపోయారు. చాలామంది రైతులు ఆరుతడి పంటల సాగుకు కూడా కర్నాటక ప్రాంతానికి వెళ్లి యూరియాను తెచ్చుకుంటున్నార.ు అవసరాన్ని డిమాండ్ ను గుర్తించి అధికారులు ఆ మేరకు సరఫరా చేయడానికి చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని రైతులు విమర్శిస్తున్నారు. ఎరువులను అందుబాటులో ఉంచితే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదని రైతులు పేర్కొంటున్నారు. స్థానికంగానే రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తే తమకు అవసరం మేరకు దొరకడమే కాకుండా ఖర్చు కూడా తగ్గుతుందని పేర్కొంటున్నారు. అందులోను ధర కూడా 300 రూపాయలకు అందిస్తున్నారని బిల్లు కూడా ఇవ్వడం లేదు కేవలం టోకెన్ ఇచ్చి బస్తాలు వివరాలు మాత్రమే పొందపరిచి తీసుకెళ్లండని సొసైటీ అధికారులు చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికంగా రైతు సేవా కేంద్రంలో పంపిణీ చేస్తే తమకు ఉపయుక్తంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు. సొసైటీలో ఎమ్మార్పీ ధర కన్నా అధికంగా అమ్ముతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారానే పంపిణీకి చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు. దీంతో తమకు రవాణా ఖర్చు సమయం ఆదా అవుతుందని పేర్కొంటున్నారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారి తిమ్మప్పను వివరణ కోరగా ప్రతిరోజు రెండు రైతు భరోసా కేంద్రాల్లో యూరియా సరఫరా చేసి పంపిణీ చేస్తామని తెలిపారు మంగళవారం గౌడన్నహళ్లి బుళ్లసముద్రం, ఆర్బికెల్లో పంపిణీ చేశామని అదేవిధంగా బుధవారం ఆర్ అనంతపురం బక్త రపల్లి,గురువారం మెళవాయి కదిరే పల్లె, ఆ మరుసటి రోజు ఆమిదాల గొంది , రొప్పం వైబిహళ్లి గంగలవాయిపాలెం ఆర్ బి కే పరిధిలో పంపిణీ చేయడం జరుగుతుందనితెలిపారు ఇప్పటికే నాలుగు ఆర్బికే కేంద్రాల్లో పంపిణీ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు ఎమ్మార్పీ ధర కన్నా అధికంగా అమ్ముతున్న వైనంపై అధికారికి తెలపగా అలాంటిది తమ దృష్టికి రాలేదని వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఫైరోజ్ బేగం మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్యసేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు, ప్రస్తుతం జరుగుతున్న ఆరోగ్య సర్వేలను, సీజనల్ వ్యాధులు, హాస్పిటల్లో రోజువారి ఓపి, తదితర విషయాలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు ప్రగతి నివేదికలను మెరుగుపరచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి నాగేంద్ర నాయక్, డిపిహెచ్ఎన్ఒ వీరమ్మ, సిహెచ్ వన్నప్ప, మండల వైద్యాధికారులు ఓంకార్, అయోష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది పూల శ్రీనివాసులు హఠాన్మరణం

ప్రజాశక్తి - కదిరి టౌన్

బార్ అసోసియేషన్ తరపున నివాళులు రెండు రోజులు సంతాప దినాలు

కదిరి పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది పూల శ్రీనివాసులు హఠాన్మరణం చెందారు. మంగళవారం తీవ్ర అస్వస్థతకు లోనైన ఆయనను కుటుంబ సభ్యులు, న్యాయవాదులుకదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పూల శ్రీనివాసులు గత 36 సంవత్సరాలుగా న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు. ఈయన కదిరి తో పాటు పలు కోర్టుల్లో న్యాయవాదిగా వృత్తిని కొనసాగించారు. అలాగే గతంలో కదిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా సేవలందించారు. ఆయన మృతి బార్ అసోసియేషన్కి తీవ్ర లోటని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌడప్ప, సీనియర్ న్యాయవాది నరసింహులు అన్నారు. పూల శ్రీనివాసులు మృతి వార్త తెలుసుకొని కదిరి బార్ అసోసియేషన్ సంఘం తరఫున న్యాయవాదులు ఆయన నివాసానికి చేరుకొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కదిరి కోర్టులో రెండు రోజులు పాటు సంతాప దినాలు ప్రకటించారు. నేడు కమతంపల్లి సమీపంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


న్యాయవాది పూల శ్రీనివాసులు (ఫైల్‌ఫొటో)

ఎయిడ్స్‌ను అంతం చేద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ఎయిడ్స్ భూతాన్ని అంతం చేయడానికి విద్యార్థి యువత నడుం బిగించాలని ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ సంస్థ కోఆర్డినేటర్ జివి. రమణ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్.ఎస్.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రగతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులైన యువత కూడా పెడదారిన పట్టి హెచ్ఐవి ఎయిడ్స్ బారిన పడుతున్నారన్నారు. ప్రజలందరిలో దీని పట్ల అవగాహన కల్పించడానికి, గ్రామీణ ప్రాంతాల వారికి చైతన్యం నింపడానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బాధ్యత గల పౌరులుగా వ్యవహరించాలన్నారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేష్ మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్. రంగనాయకులు, కళాశాల సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్ బీ. నరసింహులు, వైద్య సిబ్బంది, శ్వేత మంజుల పాల్గొన్నారు. కాగా పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించిన బీకాం తతీయ సంవత్సర విద్యార్థి పి.రాధిక, ద్వితీయ స్థానం సాధించిన బీకాం ద్వితీయ సంవత్సర విద్యార్థిని యు. పల్లవి లను, కళాశాల ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది, ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్‌ను అభినందించారు.

అవసరం మేరకే రసాయన ఎరువులు వాడాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పంటను బట్టి రసాయనిక ఎరువులను వాడాలని మట్టి నమూనాల విశ్లేషణ ప్రయోగశాల సహాయ వ్యవసాయ సంచాలకులు రోజా పుష్పలత తెలిపారు. మంగళవారం మండల కేంద్రం పరిధిలోని వడియంపేట, కొట్టాలపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు అవసరమైన మేరకు యూరియా, డిఎపి, కాంప్లెక్స్, పొటాష్ ఎరువులను వాడాలన్నారు. యూరియా వాడకం తగ్గించి పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి వాటిని వరి నాటడానికి ముందు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి శ్యాంసుందర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఇర్ఫాన్, చౌడేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు భూమి కేటాయింపు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని బీచిగానిపల్లిలో విద్యుత్‌సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఆ గ్రామ రెవెన్యూ పొలంలోని 412 సర్వే నంబర్‌లోని 1 ఎకరాల భూమిని కేటాయించినట్లు తహశీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. 412 సర్వేనెంబర్‌లోని12. 48 ఎకరాలు గాను ఒక ఎకరం భూమిని రైతు తిప్పారెడ్డి సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ఇస్తున్నటు చెప్పారు. డైక్లాట్ మేరకు ఈ భూమి రైతు పరిధిలో ఉందని ప్రజా ప్రయోజనాల కోసం రెవెన్యూ అధికారులు ఆయనను సంప్రదించగా ప్రభుత్వానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి బీచిగానిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో రైతులకు, ప్రజలకు ఇబ్బందికర పరిస్థితి ఉంటే 15 రోజుల లోపు తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.


పరిగి తహశీల్దార్


చిత్రపటాన్ని అందజేస్తున్న పూజారులు

ఖాద్రీశుడిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఖాద్రి లక్ష్మీనరసింహస్వామిని ప్రభుత్వ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవీ. ఆంజనేయులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారు రాజు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యసలహాలు పాటించాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

మూడో నెల నిండిన ప్రతి గర్భిణి వైద్యుల సలహాలు పాటించి ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మని ఇవ్వాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృఅభియాన్(పిఎం ఎస్ఎంఎ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 45 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సలహాలు సూచనలు అందజేశారు. గర్భిణులకు సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మధ్యాహ్న భోజనం అందించారు. ఈ కార్యక్రమంలోకమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖర్, హెల్త్ సూపర్వైజర్ గౌరమ్మ, ఫార్మసిస్ట్ సరస్వతి ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర,ఆరోగ్య కార్యకర్తలు, మిడలెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్.ఎస్.ఎస్ యూనిట్ విభాగంలో ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ బి. గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో "నషా ముక్త్ భారత్ అభియాన్" లో భాగంగా డ్రగ్స్ వాడకం నివారణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.కె.ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు యువతలో డ్రగ్స్ వాడకం ఒక పెద్ద సమస్యగా మారుతోందని. ఆకర్షణ, స్నేహితుల ఒత్తిడి, కొత్త అనుభవం తెలుసుకోవాలనే ఆసక్తి వంటి కారణాలతో చాలామంది విద్యార్థులు డ్రగ్స్ బారిన పడుతున్నారని అన్నారు. ఒక చిన్న తప్పుడు నిర్ణయం మన భవిష్యత్తును చెడగొట్టే ప్రమాదం ఉందన్నారు. మంచి స్నేహితులను ఎంచుకోవాలని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక పఠనం వంటి మంచి అలవాట్లతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.చిట్టెమ్మ, త్రివేణి, షమీవుల్లా , ఎన్.సి.సి. అధికారి ఎస్.పావని, ఎ. కిరణ్ కుమార్, యం. పుష్పావతి బి. ఆనంద్, యం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగసభను విజయవంతం చేయండి

పరిగి :కూటమి ప్రభుత్వ అమలుపరిచిన సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన సందర్భంగా అనంతపురంలో నిర్వహిస్తున్న సూపర్ సిక్స్ సూపర్‌హిట్ మహాసభను విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ మహాసభలకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల అభివృద్ధి కమిటీ సభ్యులు సూర్యనారాయణ, సోమప్ప, బాలాజీ, వెంకటేష్, సంజీవరాయప్ప, పరిగి మండల నాయకులు పైడేటి నాగప్ప, నాగభూషణం, డిఎస్ఎల్ శ్రీనివాసులు, వడ్డెర శ్రీనివాసులు, తిప్పేస్వామి, అచ్యుత్, బోరెడ్డిపల్లి మహేష్, రామదాసు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ఈ-ఆఫీస్‌తోనే అన్ని సేవలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో అన్ని సేవలను ఈ-ఆఫీస్ ద్వారానే అందించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఆదేశించారు. పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లతో ఈ-ఆఫీస్‌పై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు మున్సిపల్ కార్యాలయంలో ప్రతి ఫైల్‌ను ఈ-ఆఫీసులో అందుబాటులో ఉండే విధంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న రికార్డులతో పాటు ఆర్‌డిఎంఎ, డిఎంఎ, కార్యాలయాలను నుంచి వచ్చే ఉత్తర్వులతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే జీవోలను సైతం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

అందుబాటులో యూరియా : ఎడిఎ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి డివిజన్‌లోని రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని కదిరి వ్యవసాయ శాఖ ఏడిఏ సనావుల్లా తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కదిరి డివిజన్ పరిధిలోని 10 మండలాల్లోని రైతులకు సరిపడా 226 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతు సేవా కేంద్రాలలో మరియు ప్రైవేటు డీలర్ల ద్వారా యూరియా తీసుకోవాలని రైతులకు సూచించారు.

ఆరోగ్యానికి మించిన సంపద లేదు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వక్తలు పేర్కొన్నారు. ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదన్నారు. క్షయ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ మంగళవారం 5 కే రన్ నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ రన్ ను మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున జెండా ఊపి ప్రారంభించారు. వందలాదిమంది యువతీ యువకులు ఈ రన్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఎన్.ఎస్. పి.ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి, చైతన్య సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందన

ప్రజాశక్తి - ఓబులదేవరచెరువు

మండలంలోని అచ్చమియా పల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గౌస్ లాజమ్‌కుఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఆయనను మంగళవారం సన్మానించారు. విద్య, సామాజిక రంగాలలో ఆయన చేస్తున్న కృషికి హర్షం వ్యక్తం చేశారు. తమ పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. ఈసందర్భంగా గౌస్‌లాజమ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అచ్చామియాసాహెబ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ యుహనీస్ బీ, శర్మాద్, వెంకటేష్, జబ్బార్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహారావుకు సన్మానం

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని వానవోల్లు పంచాయతీ బాచన్న పల్లి గ్రామంలో మంగళవారం టిడిపి అబ్జర్వర్ నరసింహారావును బలిజ సోదరులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా గ్రామానికి అబ్జర్వర్ నరసింహారావు రావడంతో మర్యాదపూర్వకంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ సోమశేఖర్, కృష్ణమూర్తి, ఆదినారాయణ, శ్రీనివాసులు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు సంతోష్, సర్పంచి నరసింహమూర్తిచ కిషోర్ రాయల్‌చ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు

సొంత అవసరాలకు పొదుపు సంఘం నిధులు

అధికారులను ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

తమ సంఘం లీడర్ తన సొంత అవసరాలకు పొదుపు సంఘం నిధులను వాడుకుందని బుక్కపట్నం గ్రామంలోని మహిళా పొదుపు సంఘం సభ్యులు వాపోయారు. ఈ మేరకు వారు తమకు జరిగిన అన్యాయంపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత మహిళలకు మాట్లాడుతూ శ్రీ సంతోష్ మహిళా పొదుపు సంఘం, గ్రామ సంఘానికి లీడర్ గా వ్యవహరిస్తున్న కోమల అనే మహిళ తమ సంఘానికి చెందిన 7,75,000 రూపాయలను తన సొంత ఖాతాలకు మళ్లించుకున్నారని ఆరోపించారు. సంఘంలోని సభ్యులకు తెలియకుండా పెద్ద ఎత్తున నిధులు డ్రా చేసుకున్నారని సంఘ సభ్యులు నాగజ్యోతి, అశ్విని, మున్నీర, చంద్రకళ, శాంతమ్మ, జయంతి, సుభద్ర భాయ్, సాహిని తదితరులు వాపోయారు. గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు సంఘం ద్వారా వసూలు కాబడిన మొత్తాన్ని తన ఖాతాలకు జమ చేసుకుందన్నారు. పొదుపు, సిఐఎఫ్, అంతర్గత అప్పు, గ్రామ సంఘం నిధి, బ్యాంకులో ఉన్న నిల్వ మొత్తం 7,75,802 రూపాయల నిధులను సొంత ఖాతాలకు మళ్లించుకొని డ్రా చేసుకుందన్నారు. సంఘానికి చెందిన నిధులను వాడుకున్న కోమల పై రెండు నెలల క్రితం బుక్కపట్నం పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశామని, పోలీసు అధికారుల సూచన మేరకు ఇల్లు అమ్మివేసి సంఘానికి డబ్బులు చెల్లిస్తానని చెప్పి ఇప్పటివరకు చెల్లించ లేదన్నారు. ఈ విషయంపై సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడం జరిగిందని సంఘ సభ్యులు పేర్కొన్నారు. డిఆర్‌డిఏ కార్యాలయ జిల్లా అధికారికి సైతం ఫిర్యాదు చేసామన్నారు. సంఘానికి చెందిన నిధులను సొంత ఖాతాలకు మళ్లించుకున్న కోమల నుంచి తమకు డబ్బులు ఇప్పించాలని కోరామన్నారు. అదే విధంగా సీసీ విశాలాక్షి, బుక్ కీపర్ల వల్ల మాకు అన్యాయం జరిగిందని, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై డిఆర్‌డిఏ పీడీ నరసయ్య మాట్లాడుతూ శ్రీ సంతోష్ మహిళా పొదుపు సంఘం సభ్యులు అక్కడ జరిగిన బాగోతంపై తమకు ఫిర్యాదు చేశారని, మహిళల ఫిర్యాదు మేరకు విచారణకు కమిటీని వేసామని, విచారణ అనంతరం కమిటీ ఇచ్చే నివేదిక మేరకు చర్యలు తీసుకొని సంఘ సభ్యులకు న్యాయం చేస్తామని చెప్పారు.



తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న మహిళాసంఘం సభ్యులు



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రతిభా విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతిభ కనబరిచిన వికలాంగ విద్యార్థులను మంగళవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని భవిత కేంద్రంలో వివిధ ప్రతిభావంతుల పిల్లలకు సంబంధించి సయ్యద్, నాగశ్రీ అనే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఐటిఐ మొదటి సంవత్సరం ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఉన్న ప్రతిభను గుర్తించిన మండల విద్యాశాఖ అధికారి గంగప్ప ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఆనందబాబు, బైసాని రాంప్రసాద్ ఆయా విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతిభకు వైకల్యం అడ్డు కాదని ఎంతోమంది వైకల్యం ఉన్నవాళ్లు అత్యుత్తమ స్థానానికి ఎదిగారని వాళ్లను ఆదర్శంగా తీసుకొని వికలాంగులు కూడా ఎదగాలని కోరారు. ఆనందబాబు మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రసన్నలక్ష్మి సూర్యనారాయణ, రామిరెడ్డి, ఫిజియోథెరపిస్ట్ రూపేష్ నాయక్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు లలిత, నందిని పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - బుక్కపట్నం

నానో యూరియాపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, యూరియా పై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ఏడీఏ సనావుల్లా తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రంలో చేపట్టిన యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా పై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇప్పటిదాకా మండల వ్యాప్తంగా 80 టన్నుల యూరియాను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా రైతులందరూ వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల ప్రకారం నానో యూరియా పై అవగాహన పెంచుకొని పంట దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షుడు చెన్నకృష్ణ, కురవ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నరసింహులు, వ్యవసాయ అధికారి నటరాజ్, సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు సంజీవ రాయుడు, రైతు సేవ, సహకార సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమడగూరు : నానో యూరియా వాడకంపై మండలంలోని చీకిరేవులపల్లి లో రైతులకు మండల వ్యవసాయ అధికారి వెంకటరమణాచారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎఒ మాట్లాడుతూ యూరియాకి బదులుగా నానో యూరియాని వాడి పంట దిగుబడి సాధించవచ్చున్నారు. నానో యూరియాలో 20శాతం నత్రజని ఉంటుందన్నారు. నానో యూరియా వలన భూమికి, వాతావరణానికి ఎలాంటి హాని ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏవోతో పాటు ఏఈవో రమేష్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : బోరు బావుల కింద పంటలు సాగు చేసిన రైతులు యూరియా కి బదులు లిక్విడ్ అయిన నానో యూరియా వాడకాన్ని అలవాటు చేసుకోవాలని. జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రెడ్డి బాలాజీ, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ఏడిఏ కష్ణ మీనన్, తెలిపారు కొత్త చెరువులోనే మన గ్రోమోర్ సెంటర్కు 280 బస్తాల యూరియా మంగళవారం రావడంతో వాటిని రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాలాంజనేయులు, ఏఈవో సునీత, సిబ్బంది భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎముకల వ్యాధులపై అప్రమత్తత అవసరం



కేక్ కట్ చేసి ఫిజియోథెరపీ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న వైద్యులు

ప్రజాశక్తి-హిందూపురం

ఎముకలకు సంబంధించి వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బెంగుళూరుకు చెందిన స్ప్రైన్ ఆసుపత్రి వైద్యులు గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం హిందూపురంలో ఫిజియోథెరపీ వైద్యుల దినోత్సవాన్ని ఫిజియోథెరపీ వైద్యులు అంజన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ వైద్యులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వైద్యులు గోపాల్ మాట్లాడుతూ వెన్నెముక, ఎముకలకు సంబంధించి ఏమైనా వ్యాధులు సోకితే నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య చికిత్సలు పొందాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల వెన్నెముక, మెడ, కీళ్ల నొప్పులకు సంబంధించి వ్యాధులను నయం చేసుకోవచ్చున్నారు. వెన్నెముక, మెడ వ్యాధులకు సంబంధించి ఫిజియోథెరపీ ఒక్కటే సరైన వైద్యమన్నారు. ప్రస్తుతం ఫిజియోథెరపీలో ఎంతో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ వైద్యులు అనిల్ కుమార్, సతీష్, వెంకటేష్, ఇమ్రాన్, ఇర్ఫాన్, ఉన్నికృష్ణ, శ్రీలక్ష్మి, పరిమళ, శిరీష, సుమయ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో కంటిసమస్యలు దూరం

ప్రజాశక్తి - బత్తలపల్లి

విద్యార్థులు పోషకాలు కలిగిన ఆహారం తీసుకుంటే కంటి జబ్బులు దరి చేరవనిఆప్తాలమిక్ అధికారి ఉరుకుందప్ప పేర్కొన్నారు.మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు, కేజీబీవీ స్కూల్లో అప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప ఆధ్వర్యంలో 240 విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో దృష్టిలోపమున్న 31 విద్యార్థులను గుర్తించామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరికి త్వరలో కంటి అద్దాలు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ అశ్వర్థ నారాయణ, కేజీబీవీ ప్రిన్సిపల్ గుల్జార్ బేగం, హెల్త్ ప్రొవైడర్ మధురమ, ఆరోగ్య కార్యకర్త మారుతి , ఎఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు నిర్మల, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి : వైసిపి


పెనుకొండలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - పెనుకొండ

ప్రభుత్వ నిరంకుశపాలనక చరమగీతం పాడాలని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. మంగళవారం పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించారు. మడకశిరా రోడ్డు లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రైతన్నలతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. ఆర్డీవో ఆనంద్ కుమార్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగాఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో యూరియా, ఇతర ఎరువుల కోసం రైతులు గత కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్రపోతోందన్నారు. రైతులు సంక్షోభంలో ఉంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు గానీ, వ్యవసాయ మంత్రిగా అచ్చెన్నాయుడుకు గానీ చీమకుట్టినట్టయినా లేదని విమర్శించారు. రైతులు క్యూలో నిలబడితే దాన్ని బఫే భోజనంతో పోల్చిన అచ్చెన్నాయుడు అసలు మంత్రి పదవిలో కొనసాగేందుకు అర్హుడేనా? అని ప్రశ్నించారు. చేసిన తప్పిదాలకు లెంపలేసుకుని రైతులకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి అవమానపర చడం దారుణమన్నారు. రాష్ట్రానికి వచ్చిన ఎరువుల్లో అధికభాగం ప్రైవేటుకు మళ్లించడం వల్లే ఈ సమస్య వచ్చిందని అచ్చెన్నాయుడే స్వయంగా చెప్పాడని వివరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం సమన్వయకర్త కురుబ దీపిక, మడకశిర సమన్వయకర్త ఈరలకప్ప,పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల రైతులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కదిరి టౌన్ :. రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై కదిరి వైసీపీ సమన్వయకర్త మక్బూల్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వెళ్లి కదిరి ఆర్డీవో వివిఎస్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా, పూల శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించి, సక్రమంగా ఎరువులు అందేలా చూడాలని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. వైసిపి చేపట్టిన రైతు పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్డీవోకార్యాలయం ముందు ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. వైయస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు గణేష్ కూడలి నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెండు గంటల పాటు ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో సువర్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ, మండల కన్వీనర్లు ఈశ్వరయ్య, రవి నాయక్, మహిళా నాయకురాలు కన్యాకుమారి, సాయి లీల, మాజీ మండల కన్వీనర్లు రంగారెడ్డి, గంగాధర్, యనమల పల్లి మధుసూదన్ రెడ్డి, అవుటాల రమణారెడ్డి, వెంగళమ్మ చెరువు రమణారెడ్డి, నరసారెడ్డి, మాధవరెడ్డి, కొత్తచెరువు ఎంపీపీ జడ్పిటిసి రెడ్డప్ప రెడ్డి, బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, కొత్తచెరువు కన్వీనర్ శ్యాంసుందర్ రెడ్డి, బంజారా నాయకుడు గోవింద నాయక్, వందలాదిమంది వైసిపి నాయకులు కార్యకర్తలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన వైసిపి

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు రాష్ట్రంలో అన్నదాతలను వైసీపీ ప్రభుత్వం పూర్తి విస్మరించి మోసం చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. అనంతపురం బుధవారం జరగనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. జగన్ ఉచిత పంటల బీమా పేరుతో రైతులను మోసం చేశారన్నారు. ఉద్యాన పంటలకు మద్దతు ధరలు ప్రకటించినా ఒక్క కేజీ కూడా కొనలేదన్నారు. వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యరంగాలను సర్వనాశనం చేశారని విమర్శించారు. అలాంటి వ్యక్తి నేడు కూటమి ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూడడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తూ పని చేస్తోందన్నారు. ముందుగానే యూరియా, విత్తనాలు, బీమా, మద్దతు ధరలతో సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. 130 కోట్లు ఖర్చు చేసి 7.37 లక్షల మంది రైతులకు రాయితీతో 4.08 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందించామని తెలిపారు. గత ప్రభుత్వం 9 ఉద్యాన పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించలేదన్నారు. కూటమి ప్రభుత్వం సాంప్రదాయ పంటలతో పాటుగా వాణిజ్య పంటల ధరలు కూడా పడిపోయినప్పుడు రైతులకు అండదండగా నిలిచి వారిని ఆదుకుందని అన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యానవన పంటల హబ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పాన్ని గత ప్రభుత్వ పాలకులు సర్వనాసనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యానవన పంటలను సాగును ప్రోత్సహిస్తూ డ్రిప్, స్ప్రింక్లర్లు తదితర వాటిని రైతులకు సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి బత్తలపల్లి

ప్రతి రైతు ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని గుమ్మల్లకుంట గ్రామంలో ఈ పంట నమోదును పరిశీలించారు. రైతులకు ఈ పంట ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.

సరిహద్దులు గుర్తించండి

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలో ఉమ్మడి భూముల సరిహద్దులను గుర్తించాలని అడవుల సంరక్షణ కమిటీ అధ్యక్షులు యనమల గంగులప్ప నాయుడు కోరారు. ఈసందర్భంగా ఆయన డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఫౌండేషన్ ఎకలాజికల్ సెక్యూరిటీ కమిటీ 13 గ్రామాలలో ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితులను ఏర్పాటు చేసి ఈ కమిటీల ద్వారా ఆయా గుట్టలను రక్షిస్తున్నారన్నారు. ఈ కొండగుట్టలు ఎటువంటి అక్రమాలకు గురికాకుండా కాపాడాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలపై 'రణభేరి'

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రా రెడ్డి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు, సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర విద్యారంగా సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 వ తేదీ నుండి 19 వరకు నిర్వహించే రణభేరిని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా కార్యదర్శి ఆర్. రామకృష్ణ నాయక్ తో కలసి ధర్మవరం యుటిఎఫ్ జోన్ ఆధ్వర్యంలో చేపడుతున్న రణభేరి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పిఆర్సి ఊసేలేదని,కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క డిఎ కూడా ఇవ్వకపోగా వేలకోట్ల ఆర్థిక బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇక విద్యాశాఖలో నిరంతరం "ఆన్లైన్ - అప్లోడింగ్" అంటూ బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని విమర్శించారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని ఒకవైపు స్వచ్ఛందం అంటూనే మరోవైపు ఖచ్చితంగా కొనసాగించాలని ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. పరీక్షల మూల్యంకనాన్ని ఉపాధ్యాయులకే పరీక్షగా మార్చేశారని విమర్శించారు. ఉమ్మడి సర్వీసెస్ సమస్యను పరిష్కరించాలని బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం పట్టణ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జింక హరికృష్ణ, సాయి గణేష్, యూటిఎఫ్ నాయకులు రామకృష్ణ, లక్ష్మయ్య, రాంప్రసాద్, హెచ్. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలి

వైద్యులు విజయ్ కుమార్, సుమన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థినులు ఏ సమస్య వచ్చినా ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా మానసిక దృఢత్వంతో ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ సుమన, డా॥ ప్రసూన తెలిపారు. అక్టోబర్ 13, 14, 15వ తేదీల్లో అనంతపురంలో జరగనున్న ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో మంగళవారం నాడు ఐద్వా, ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సును నిర్వహించారు. డాక్టర్ ప్రసూన అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యంతో పాటు మానసిక దఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యతోపాటు ఆరోగ్య పరిరక్షణకు స్వయం చైతన్యం అవసరం అన్నారు. మంచి విద్యాభ్యాసంతో ఉన్నత స్థానాలు అధిరోహించాలని తెలియజేశారు. సమస్య ఎదురైతే తల్లిదండ్రులు, గురువులకు తెలియజేయాలన్నారు. డాక్టర్ సుమన మాట్లాడుతూ ఏ సమస్య ఎదురైనా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. జెవివి రాష్ట్ర నాయకురాలు డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ సమాజంలో మహిళలకు రక్షణ కరువైందని, ఎక్కడ చూసినా దాడులు హత్యలు పెరిగాయన్నారు. ఇలాంటి సమయంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెడు స్నేహాలు చేయకూడదన్నారు. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు పల్లవి మాట్లాడుతూ మహిళలకు పోరాడే పటిమ ఉంటుందన్నారు. మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అందుకు విద్య ఒక్కటే ప్రామాణికం అన్నారు. రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానుజ మాట్లాడుతూ మహిళలు చైతన్యం, ధైర్య సాహసాలతో మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, ఎస్ఆర్ జూనియర్ గర్ల్స్ కళాశాలలో విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌కుమార్

మంత్రివర్గ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి : బిఎస్‌పి

ప్రజాశక్తి-హిందూపురం

వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ హిందూపురం నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా అధ్యక్షులు కొల్లకుంట వడ్డే నాగరాజ్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను వైద్య విద్యను దూరం చేయడానికి మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తూ మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోవడం సరైనది కాదన్నారు. దీనివల్ల బహుజన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు వైద్య విద్యను చదవాలనే ఆలోచన కూడా లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం చాలా అన్యాయంగా ఉందన్నారు. పిపిపి విధానం ఉన్నత సామాజిక వర్గాలకు ప్రయోజనంగా ఉండే తప్ప బహుజనులకు ప్రయోజనం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వల్ల ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు వైద్యులు కావాలన్న కలలను చిదిమేస్తున్నారని వాపోయారు. మెడికల్ సీట్లను కోట్లాది రూపాయలకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ప్రజల ఆస్తులను 63 సంవత్సరాలకు ఎలా లీజ్ కు ఇస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం పది మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడానికి క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. వైద్య విద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసే విధానాన్ని ఆపేసి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు దాసరి ఈశ్వరయ్య, పెన్నయ్య, సుబ్బరాయప్ప, క్రిష్టప్ప, వెంకటేశప్ప, నారాయణప్ప, రామప్ప, రామాంజినప్ప, నరసింహప్ప, రవికుమార్, మూర్తి, ఆదినారాయణ, తిరుమలేష్, గట్టు తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్: ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు ప్రణాళిక, పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ అధికారులకు తెలియజేశారు. కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో మంగళవారం నాడు వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల నుంచి బహిరంగ సభకు వచ్చే ప్రజలను తిరిగి వారి స్వగ్రామాలకు తీసుకెళ్లే వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సౌకర్యాలు కల్పించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ.మలోల, డీఆర్డీఏ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీం బాషా, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.